Government Primary School
KOTLA ALIJA BALDA.

# కిటికీ
## (ఏకాంకిక)

వినయబాబు: ఈ కిటికీలో కూర్చొని, దూరంగా శూన్యంలోకిచూస్తే ఎంతో బాగుంటుంది. ఈ రోజు వర్షం పడడంలేదు. వర్షంవస్తే దూర, దూర ప్రదేశాలన్నీ వాన తెరను కప్పుకుంటాయి. ముసురు చూడడానికి బాగుంటుంది, కానీ రంగు, రంగుల ఆకాశాన్ని గాలికి తలలాడించే పొడుగాటి చెట్లనీ, ఎత్తైన తెల్లటి బంగళాలనీ, కప్పివేస్తుంది. వర్షాన్ని కొంచెంసేపుచూచి ఆనందించవచ్చు. కానీ ఒకటేపనిగా దాన్నేచూడడం అంటే విసుగేస్తుంది. వర్షంలోతడిస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. కాని అమ్మచూస్తే తంతుంది. నాన్న గంభీరంగా మొహంపెట్టి, వర్షంలోకి వెళ్లకూడదని అంటాడు. వర్షంలోకి వెడితే జలుబుచేసి, జ్వరంవస్తుందని అమ్మ చెబుతుంది. నేను వర్షంలోకి వెళ్లలేదు, కాని జ్వరం ఎందుకు వచ్చిందో తెలియదు. దగ్గుకూడా నన్ను భాదిస్తున్నది. దగ్గు రావడంతోనే అమ్మ చేదు మాత్రలు ఇస్తుంది. వాటిని మింగీ. మింగీ తల ప్రాణం తోకకు వస్తున్నది. ఈ చేదుమాత్రలు ఎవడు పుట్టించాడో? జ్వరం రావడంవల్ల ఈ రోజు బడికివెళ్లలేదు. బడికివెడితే దారిలో ఎన్నో విచిత్ర విషయాలు కనపడతాయి, కోతులాట చూడవచ్చు. దారివె బడి గంతులు వేయవచ్చు.

సుందరితో కీచులాడవచ్చు. ఈ రోజు సుందరి బడికి వెళ్లి ఉంటుంది. అది బడిఎగ్గొడితే ఎంతో బాగుండేది. ఇద్దరమూ చక్కగా ఆడుకునే వాళ్లం

ఆకాశంలో పక్షులన్నీ ఎడతెరిపిలేకుండా ఎగురుతున్నాయి. ఒక వేపునించి, ఇంకొక వేపుకుపోతున్నాయి. ఎక్కడనించి వస్తాయో, ఎక్కడికిపోతాయో తెలియదు. పక్షికి మల్లే ఆకాశంలో ఎగిరితే ఎంతబావుంటుంది! రోజూ కొత్త, కొత్త ప్రదేశాలు చూడవచ్చు. నీలి ఆకాశాన్ని, ఎండలో, అద్దంవలే మెరిసే చెఱువునీ, పైనించి ఎగురుతూ చూడవచ్చు. దేవుడు మనిషిని రెక్కలతో ఎందుకుపుట్టించడో, ఈ సంగతి అమ్మనడిగి తెలుసుకోవాలి. నాన్ననడిగితే విసుక్కుంటాడు. నాన్న ఉదయంనించీ సాయంత్రం వరకూ, ఎక్కడో తిరుగుతాడు, ఎక్కడికివెడతాడో ఏమో తెలియదు. నేను పెద్దవాణ్ణిఅయితే ఎంత బావుండేది. ఎవరితోచెప్పకండా, ఎక్కడికైనా హాయిగా వెళ్లివచ్చేవాడిని. అమ్మ తప్పకండా కోపపడేది. ఇప్పుడు మాత్రం కోపపడడంలేదనా? నాన్న కోపపడకండా ఉండేచాలు. అమ్మకోపాన్నిఎవరు లక్ష్యంచేస్తారు. చెప్పు (దూరంగా Ice fruit, Ice fruit అనే శబ్దాలు వినపడతాయి.)

వినయబాబు: Ice fruit వాడు వస్తున్నాడు. కిటికీ పక్కన ఉన్న ఈ రోడ్డు మీదినించే ఎక్కడికో వెడతాడు.

Ice fruit కొనుక్కోవడానికి అణా కావాలి, అమ్మ నడిగితే జ్వరంలో Ice fruit తింటావా అని కోపపడుతుంది. తినడానికి తియ్యగా, చల్లగా ఉంటుంది. కాని కొనుక్కోవడం ఎట్లా? అదిగో వస్తూనే ఉన్నాడు. మొదట దగ్గరకి పిలుద్దాం. ఆ తరువాత, కొనేవిషయం ఆలోచించవచ్చు. ఏ Ice fruit, Ice fruit, ఇక్కడరా!

Ice fruit వాడు: అణాది కావాలా, 3 పైసలది కావాలా?

వినయబాబు: నీ దగ్గర యీ రెండు రకాలే ఉన్నాయా?

Ice fruit వాడు: అవును రెండేరకాలుఉన్నాయి. నీకేది కావాలో చెప్పు.

వినయబాబు: నాలుగైదు రకాలుచేస్తే ఎక్కువ అమ్ముడు పోతాయికదూ?

Ice fruit వాడు: నేను బీదవాడిని, ఎక్కువ రకాలు తేలేను.

వినయబాబు: నీ దగ్గర డబ్బులేదూ?

Ice fruit వాడు: లేదు, ఈ Ice fruit అమ్ముకుని, పొట్ట గడుపుకుంటున్నాను.

వినయబాబు: మా నాన్న దగ్గర చాలా డబ్బుఉంది. కానీ నేనడుగుతే యివ్వడు. రోజూ అమ్మకు చాలా డబ్బు యిస్తాడు. నేను పెద్దవాడిని అయితే చాలా డబ్బు సం

పాదిస్తాను. అప్పుడు నీకు కావలసినంత డబ్బు యిస్తాను.

Ice fruit వాడు: చల్లగా బ్రతుకు, నాకదే పదివేలు, Ice fruit కావాలా?

వినయబాబు: నా దగ్గర డబ్బులేదు. అమ్మను అడిగితే కోపపడుతుంది.

Ice fruit వాడు: డబ్బు, అవసరంలేదు. పోనీ, తీసుకో.

వినయబాబు: నాకుజ్వరం వస్తున్నది. Ice fruit తింటేఅమ్మ కోప్పడుతుంది

Ice fruit వాడు:— జ్వరంలో Ice fruit తిన కూడదు. ఈసారి ఎప్పుడైనా, నీకు Ice fruit యిస్తాను. ఇకవెళ్లి వస్తా.

వినయబాబు: నువ్వుచాలా మంచివాడివి, నాన్నకు మల్లే నీవుకోపపడవు, అప్పుడప్పుడువస్తూవుండు !

(Ice fruit వాడు Ice fruit, Ice fruit, అని అరుస్తు వెళ్లిపోతాడు)

వినయబాబు: Ice friut వాడువెళ్లిపోయినాడు, మళ్లీ ఏమీ తోచడంలేదు, ఎవరైనావస్తే బావుండును. అదిగో ఆదారి చివరన ఎవరో అమ్మాయి గంప నెత్తిమీద

పెట్టుకొని, ఈ వేపేవస్తున్నది. గంప నెత్తిమీద పెట్టుకుని రోజూఎక్కడికైనవెడితే బాగుండేది. దారిపొడుగునా పెప్పరుమెంట్లు తింటూకాలం గడుపవచ్చు. కొద్దిగా మొండికేస్తే అమ్మపైసాయిస్తుంది. కాలం, సుఖంగా గచిడిపోతుంది.అదిగో !ఆఅమ్మాయి దగ్గరకు వచ్చింది. ఏ అమ్మాయి, ఇల్లారా!

అమ్మాయి: ఎందుకూ?

వినయబాబు: వస్తేచెప్తా?

అమ్మాయి: ఇదిగో! వచ్చాను, ఏమిటో, చెప్పూ?

వినయబాబు: ఆగంపలో ఏమున్నాయి.

అమ్మాయి: కనపడడంలేదూ? పాలచెంబులు.

వినయబాబు: ఆపాలు ఎక్కడికి తీసుకపోయినావు?

అమ్మాయి: రాతం పోయడానికి, మాయజమాని ఇంటికి వెళ్లాను.

వినయబాబు: యజమాని అంటే

అమ్మాయి: యజమాని అంటే, డబ్బుయిచ్చేవాడు.

వినయబాబు: నీదగ్గర డబ్బులేదూ?

అమ్మాయి: కష్టపడి సంపాదిస్తాము.

వినయబాబు: నేను కష్టపడితే నాకు డబ్బువస్తుందా?

అమ్మాయి: నువ్వుయింకా చిన్నవాడివి, నామోస్తరు పెద్ద వాడివి అయిన తరువాత సంపాదించవచ్చు.

వినయబాబు: నాకుపని నేర్పుతావా? పాలుపితకడం,అదీనీ,

అమ్మాయి: చిన్నవాళ్లు పితకలేరు.

వినయబాబు: గోదలని కాయడం నేర్పుతావా? ప్రొద్దస్తమా నం హాయిగా అడవిలో తిరగవచ్చు.

అమ్మాయి: పెద్దవాడివి అయినతరువాత తప్పకండా నేర్పుతాను. పాలుతాగుతావా?

వినయబాబు: పాలంటే నాకు బొత్తిగ యిష్టంఉండవు. మాఅమ్మరోజూ ఉదయం పాలుపోస్తుంది. అవి తాగ డం నాకు విసుకుగా ఉంటుంది.

అమ్మాయి: నీ పేరేమిటి?

వినయబాబు: 'వినయబాబు' అమ్మ బాబు అని మాత్రమే పిలుస్తుంది.

అమ్మాయి: బాబూ నీవు ముద్దుగా మాట్లాడుతావు. నాలుగు కాలాలపాటు చల్లగా బ్రతుకు. ఇంక నేను వెళ్లివస్తా.

వినయబాబు: అప్పుడప్పుడు వస్తూవుండు. యీసారి నీవు పాలు తెస్తే తప్పకండా తాగుతాను.

పాలఅమ్మాయి వెళ్లి పోయింది. ఎవరో బిచ్చగాడు పాట పాడుతూ వస్తున్నాడు.

బిచ్చగాడు: ఎన్నాళ్లుండెదవు ఇహసుఖములలో
కొన్నాళ్లేగద మనసా!
మాసిపోని మాట ఒకటే కడకీ
యిలలో మిగిలేది.
నీకొరకై, నీవారలకొరకై నిలు
వదు కాయము మనసా!

వినయబాబు: ఏ బిచ్చగా! యిల్లారా!

బిచ్చగాడు: ఎందుకు బాబూ!

వినయబాబు: ఆ పాట నాకునేర్పుతావా!

బిచ్చగాడు: పాట బాగుందా?

వినయబాబు: పాట అర్ధం ఏమిటో తెలియలేదు. కాని విన డానికి బాగుంది.

బిచ్చగాడు: అర్ధం నీ కిప్పుడే తెలియదు.

వినయబాబు: చెబుతే ఎందుకు తెలియదు. నాకన్ని సంగ తులు తెలుసు.

బిచ్చగాడు: దాని అర్ధం నీ కెట్లా చెప్పాలో నాకూ తెలియ డంలేదు. మనచుట్టూ వున్నవస్తువులు మాయమౌతాయి. ఈ లోకంలో మంచిమాట ఒక్కటే నిలిచిపోతుంది.

వినయబాబు: భలే, భలే, నేనిక్కడనించి మాయమౌతే బాగుంటుంది.

బిచ్చగాడు: బాబూ ఆమాట అనకు అదిచాలాతప్పు. చల్లగా నాలుగు కాలాలపాటు వర్ధిల్లు.

వినయబాబు : లేదు, నేను మాయమౌతాను, అమ్మకీ నాన్నకీ, కనపడకండా మాయమౌతాను. ఎవ్వరికి కనపడకండా మాయమౌతాను.

బిచ్చగాడు: వద్దుబాబు ఆమాటలనకు నేను వినలేను.

వినయబాబు: నేను మాయమైతే నామాటలు ప్రపంచంలో నిలిచిపోతాయా? అమ్మకూ, నాన్నకూ జ్ఞాపకం, ఉంటాయా?

బిచ్చగాడు: బాబూ వద్దంటే నీవు ఆ మాటలు మాట్లాడుతున్నావు. ఎంతచెప్పినా వినిపించుకోవు. నీవు ఆ మాటలంటుంటే ఎందుకో నాకు భయమేస్తున్నది. ఇంకనేను నీతో మాట్లాడను, నేను వెళ్లిపోతాను.

వినయబాబు: నేనిక్కడ మాయమై ఇకనిన్ను వెంబడిస్తాను.

బిచ్చగాడు: బాబూ నీకు కాదూ చెప్పేది!

వినయబాబు: నాన్నకు మల్లే నీవుకూడా కోప పడుతున్నావు, ఇక నీతో నేనెన్నడూ మాట్లాడను.

## రెండవ దృశ్యం

(15 రోజుల తరువాత—లోపల వినయబాబు తల్లి, గదిలో ఏదో సర్దుతూవుంటుంది. వెలుపల Ice fruit Ice fruit అంటూ Ice fruit వాడు, కిటికీ శూన్యంగావుంది)

Ice fruit వాడు: లోపలో ఎవరూ?

తల్లి: నీకేం కావాలి?

Ice fruit వాడు: నువ్వు వినయబాబు తల్లివా? వినయబాబు ఏడీ?

తల్లి: ఎనిమిది రోజులైంది మమ్మలను వదిలి ఎక్కడికో వెళ్లిపోయినాడు.

Ice fruit వాడు: నేను మంచి Ice fruit తెచ్చాను ఎవరికి యివ్వనూ?

(పాల అమ్మాయి, పాలతో ప్రవేసిస్తుంది)

అమ్మాయి: బాబు ఏడీ? ఈరోజు మంచిపాలు తెచ్చాను. ఈ సారి అయినా తాగుతాడో లేదో? పాలు యిష్టంలేదని చెప్పాడు.

తల్లి: బాబు వెళ్లిపోయి వారం రోజులౌతోంది.

అమ్మాయి: పాలుతాగనని చెప్పాడు. తన శపథం చెల్లించుకున్నాడు.

❖

బిచ్చగాడు: ఎన్నాళ్లుండెదవు ఇహసుఖములలో
కొన్నాళ్లే గదమనసా
మాసిపోని మాటఒకటే కడకీ
యిలలో మిగిలేది.

(పాట ఆపి) వినయబాబు ఏడీ?

తల్లి: లేదు, Typhoid వచ్చి 8 రోజులక్రితం, ఈ లోకం విడిచి వెళ్లిపోయినాడు.

బిచ్చగాడు: 15 రోజులక్రితం, తాను మాయమౌతానన్నాడు. వద్దుబాబూ ఆ మాట అనవద్దంటే ఎంతకూ వినలేదు. అన్నట్టు, చివరకు మాయమైనాడు.

తల్లి: మమ్మలను, దుఃఖంలోముంచాడు. మాకు ఏఆధారం లేకుండా చేసాడు.

బిచ్చగాడు: బాబుమాటలు మాత్రం నిలిచిపోయినాయి. మన మంతా వాటిని ఎన్నటికీ మరచిపోలేము.

ఎన్నాళ్లుండెదవు ఇహ సుఖములలో
కొన్నాళ్లేకద మనసా
మాసిపోనీ మాటఒకటే
కడకీ యిలలో మిగిలేది.

❖